# ప్రాయశ్చిత్తం

**నా**కు తెలుసు – భగవతంగాడికి నన్ను చూస్తే అసూయ. మాధవి నాతో ఆదరంగా మాట్లాడుతుందని!

తనతో మాట్లాడదని ఉడుకుమోత్తనం. తనతో – అంత కొరకరాని కొయ్యతో – ఏ మనిషి ఆప్యాయంగా మాట్లాడ్డానికి ఒప్పుకుంటుంది?

నాకు మాధవిమీద ఏదో ఆశ వుందని వాడి అనుమానం. పైకి అనడుగాని.

“నువు వట్టి. దేభ్యానివి గనక ఆ మాధవి కెదురుగా కూచుని మురుస్తావు!” అని తిడతాడు నన్ను.

“మాధవి కెదురుగా కూర్చోవాలని నీకుమాత్రం లేదా?” అంటాను.

“ఎదురుగా కూర్చునా? నేనయితే అక్కడితో ఆగ్గల్నా? నీ మాదిరిగా ఆమెతో చనువుగా మాట్లాడే అవకాశమే దొరికితే ఆపైన ఏం చేస్తానో, దానికి నేను గాదుగదా, నన్ను పుట్టించిన బ్రహ్మ కూడా కర్తకాడు!” అంటాడు.

“ఇంకేం? నా మాదిరిగా నీకు పెళ్లీ పెటాకులూ కాలేదుగా? పోయి మాధవిని పెళ్లాడమని ఎందుకడగవూ?” అంటాను.

ఆపాట్ట వాడు మాధవిని నానా మాటలూ అనటం మొదలుపెట్టాడు. ఆమె తన కులవృత్తిలో ప్రవేశించటానికి బదులు చదువుకుని చెడిపోయిందట! సంసారాలు చేసేవాళ్లే నాసి సరుకుట! సంసారి అయిన సానికూడా అంతేట! పెళ్లయిన ఇల్లాలికి మొగుడు తప్ప మిగిలిన మగవాళ్లంతా పర పురుషులయితే, మాధవికి మగాళ్లంతా పరుపురుషులేట! మాధవి భర్త ఎవడూ?” అంటాడు భగవంతంగాడు.

బహుశా మాధవి పెళ్లాడదట. ఒకవేళ పెళ్లాడితే తన మేనమామ వరించి తెచ్చినవాణ్ని పెళ్లాడి – వాడితత్వం ఎటువంటిదో తెలుసుకోకుండా అధోగతి పాలవుతుందిట.

“తన్ను ప్రేమించటానికి సిద్ధంగా ఉన్న వాళ్లెవరో కూడా మాధవికి తెలీదు. వారిలో ఉత్తముణ్ని ఎట్లా ఎన్నుకుంటుందీ?” అంటాడు వాడు.

"ఆమెని పెళ్లాడ్డానికి సిద్ధంగా ఉన్నవాడు వచ్చి తన అభిప్రాయం చెప్పుకోలేడా?" అంటాను.

"ఎవరితో? ఆవిడ మేనమామతో!"

"ఉత్తరం రాయలేడా?"

"మీ మాధవి తనకువచ్చే ఉత్తరాలు తాను చదవదుగా! ఎవరేం రాస్తారో? ఆ పతివ్రతను ఇనప బోనులో పెట్టి రక్షిస్తున్నాడా మేనమామ! కోర్టుకెక్కి వ్యాజ్యం గెల్చి మాధవిని తీసికొచ్చిందిందుకే!"

నాకు కోపం వచ్చి – "నువు లక్ష చెప్పు మాధవి ఆత్మరక్షణార్థం అవలంబించే పద్ధతులన్నీ రైటైనవే. నీవంటి దుర్మార్గుడు ఏకాంతంగా తనతో మాట్లాడకుండానూ, అవాకులూ చెవాకులూ రాయకుండానూ చూసుకోవడంలోనే ఆమె తెలివిగా ప్రవరిస్తున్నది" అంటాను.

ఆ నా డాదివారం. అలవాటు ప్రకారం నేను మాధవిని చూడబోయినాను. అదీ ఇదీ మాట్లాడుకుంటుండగా పోస్టు వచ్చింది మాధవికి ఒక కవరు.

ఆమె కవరు నా చేతికిచ్చి, "చూడండి!" అన్నది.

పై దస్తూరి చూడగానే నాకు పట్టరాని సంతోషం కలిగింది. వెధవ! ఇన్ని కోతులకోసి నాతో చెప్పకుండా మాధవికి ఉత్తరం రాస్తాడు! తన బతుకు నేను మాధవికి చెప్పననే! తను రాసే అబద్ధాలు మాధవిని నమ్మనిస్తాననే!

ఉత్తరం చించి చదవటం మొదలుపెడితే మొదట నాకేమీ అర్థం కాలేదు. తరువాత నా ఒళ్లు మండిపోయింది.

"ఓరీ తుచ్ఛుడా! ఆడవాళ్ల ఉత్తరాలు చూడవచ్చురా వాళ్లు చూడమంటే మటుకు!"

అంతే – ఆ ఉత్తరంలో ఇంకేమీలేదు.

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***
***యువ కార్యాలయం, తెనాలి***